క్లుప్తంగా

గ్రామాల్లో ఫీవర్ సర్వే



గ్రామాల్లో ఫీవర్ సర్వే చేస్తున్న వైద్య సిబ్బంది

దెందులూరు: గోపన్నపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో అన్ని గ్రామాల్లో ఫీవర్ సర్వే నిర్వహిస్తున్నామని పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ రాకేష్, డాక్టర్ రోజ్‌మేరీ అన్నారు. మంగళవారం వేగవరం, మసీదు పాడు, గోపన్నపాలెం, సానిగూడెం గ్రామాల్లో నిర్వహిస్తున్న ఫీవర్ సర్వేను ఎంపీహెచ్‌ఓ సత్య నారాయణ పరిశీలించారు. ఏఎన్‌ఎంలు ఆశా కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి కుటుంబంలో అందరి ఆరోగ్య పరిస్థితులతో పాటు జ్వరాల వివరాలు నమోదు చేసుకుంటున్నారన్నారు. విధి నిర్వహణలో వైద్య సిబ్బందికి అన్ని కుటుంబాల సభ్యులు సహకరించాలని వైద్యులు కోరారు.

అడ్వాన్స్‌డ్ పోస్టల్ టెక్నాలజీ ప్రారంభం



అడ్వాన్స్‌డ్ పోస్టల్ టెక్నాలజీ 2.0ను ప్రారంభించిన సిబ్బంది

దెందులూరు: దెందులూరు పోస్ట్ ఆఫీస్‌తో పాటు మండలంలోని అన్ని పోస్ట్ ఆఫీసుల్లో అడ్వాన్స్‌డ్ పోస్టల్ టెక్నాలజీ 2.0ను పోస్టు మాస్టర్ వేంకటేశ్వరరావు ప్రారంభించారు. డిజిటల్ ఇండియా చేరువలో భాగంగా భారత తపాలా శాఖ ఈ నూతన సాఫ్ట్‌వేర్‌ను ప్రారంభించిందన్నారు. దీని వలన ప్రజలకు మరింత మెరుగైన వేగవంతమైన సేవలను పోస్ట్ ఆఫీసులో అందిస్తామన్నారు. భవిష్యత్తులో వినియోగదారుల అవసరాల నిమిత్తం మరిన్ని సేవలు అందించడంలో ఈ కొత్త వ్యవస్థ దోహద పడుతుందని వివరించారు. ఈ కొత్త న్యూ జనరేషన్ టెక్నాలజీ సాఫ్ట్‌వేర్‌ను విని యోగదారులు సద్వినియోగం చేసుకోవాలని పోస్ట్‌మ్యాన్ సురేష్ తెలిపారు.

330 హాస్టల్ సీట్లు ఖాళీ

దెందులూరు: కొవ్వలిలో ఉన్న నియోజకవర్గ ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌లో 330 సీట్లు ఖాళీ ఉన్నాయని ఇంటిగ్రేటెడ్ హాస్టల్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సత్యనారాయణ అన్నారు. మంగళవారం హాస్టల్‌లో ఆయన మాట్లాడుతూ మూడో తరగతి నుంచి పదో తరగతి వరకు ఉచిత వసతి భోజన సౌకర్యం కల్పిస్తామన్నారు. దెందులూరు మండలంతో పాటు సమీప గ్రామాల్లో పాఠశాలల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మరిన్ని వివరాలకు కొవ్వలిలోని నియోజకవర్గ ఇంటిగ్రేటెడ్ హాస్టల్ సంప్రదించాలని ఆయన కోరారు.

ఆంజనేయునికి ప్రత్యేక పూజలు



ఆంజనేయునికి పూజలు చేస్తున్న భక్తులు

పెదపాడు: అప్పనవీడులో వేంచేసియున్న అభయాంజనేయ స్వామి దేవస్థానంలో మంగళవారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం 200 మందికి అన్నదానం నిర్వహించారు. ఈ అన్నదానానికి హనుమాన్ జంక్షన్‌కు చెందిన చలసాని ఆంజనేయులు, కుటుంబ సభ్యులు ఆర్థిక సాయం అందించారు. ఆలయ అర్చకులు పూజలు చేశారు. వేమూరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పోక్సో చట్టం, శక్తి యాప్‌పై అవగాహన

ఏలూరు (ఆర్ఆర్‌పేట): పోక్సో చట్టం పరిధిలోకి వచ్చే నేరాలు, బాధితులు తీసుకోవాల్సిన చర్యలపై మంగళవారం స్థానిక కస్తూరిబా నగరపాలక ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఏలూరు వన్ టౌన్ సీఐ సత్యనారాయణ పర్యవేక్షణలో ఎస్సై నాగబాబు బాలికల భద్రత కోణంలో సైబర్ నేరాలు సోషల్ మీడియా వేదికల వాడకంలో జాగ్రత్తలు, వ్యక్తిగత సమాచారం పంచుకోవడంలో ఉండే ప్రమాదాలు, ఫేక్ అకౌంట్స్, మోసపూరిత లింకుల ద్వారా జరుగుతున్న నేరాలపై అవగాహ న కల్పించారు. ఆపదలో ఉన్న మహిళలు, యువతులు తక్షణ సహాయం పొందేందుకు శక్తి యాప్‌ను ఎలా ఉపయోగించాలో ప్రాక్టికల్‌గా వివరించారు.

పాఠశాలలో వసతుల కొరతపై కలెక్టర్‌తో చర్చ

ఏలూరు(మెట్రో): భీమడోలు మండలం పాలసానిపల్లిలోని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల పాఠశాలలో విద్యార్థులు మౌలిక వసతుల కొరతతో ఇబ్బందులు పడుతున్నారని, ఈ సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని జెడ్పీ చైర్‌పర్సన్ జి.పద్మశ్రీ జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్విని కోరారు. మంగళవారం కలెక్టర్‌ను కలిసిన ఆమె ఇటీవల పాఠశాలను సందర్శించిన సందర్భంగా అక్కడ గుర్తించిన సమస్యలను కలెక్టర్‌కు వివరించారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ సమస్యలను పరిశీలించి తగు చర్యలు తీసుకుంటానని చెప్పారు.

అర్ధాకలితో హైస్కూల్ నైట్ వాచ్‌మెన్లు

- ఆరు నెలలుగా అందని గౌరవ వేతనం
- బకాయి వేతనాలు విడుదల చేయాలని వేడుకోలు



దెందులూరు ఉన్నత పాఠశాల

దెందులూరు: ఆరు నెలలుగా గౌరవ వేతనం అందకపోతే తమతో పాటు తమ కుటుంబ సభ్యులను ఎలా పోషించుకోవాలని, ఎలా బతకాలని ఉన్నత పాఠశాలల నైట్ వాచ్‌మెన్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఉన్నత పాఠశాలకు కంప్యూటర్లు, ఫర్నిచర్, క్రీడా సామాగ్రి, కాంపౌండ్ వాల్, ఇతర ఆస్తులను కాపాడేందుకు నైట్ వాచ్‌మెన్లను గౌరవ వేతనం ప్రాతిపదికన నియమించారు. ఒక్కో నైట్ వాచ్‌మెన్‌కు నెలకు రూ.6 వేలు గౌరవ వేతనంగా నిర్ధారించి ఇచ్చారు. కూటమి ప్రభుత్వం గత ఆరు నెలల నుంచి గౌరవ వేతనం ఇవ్వకపోవడంతో ఏం చేయాలో జీవన విధానం ఎలానో తెలియక ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండు, మూడు నెలలపాటు అయితే కిరాణా షాపుల వద్ద పాఠశాలల్లో ఇతర అవసరాలకు సర్దుబాటు చేసుకుంటాం. ఆరు నెలలుగా ఎక్కడ అప్పు పెడతారని ప్రశ్నిస్తున్నారు. జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు సైతం పట్టించుకోకపోతే తమ పరిస్థితి మరింత అధ్వానంగా మారనుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నియోజకవర్గం వారీగా పాఠశాలలు

దెందులూరు	7 పాఠశాలలు	7వాచ్‌మెన్లు
పెదపాడు	11	11
పెదవేగి	14	14
ఏలూరురూరల్	10	10

గౌరవ వేతనాలు కూడా ఇవ్వలేరా



ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న నైట్ వాచ్‌మెన్లకు ఆరు నెలలుగా గౌరవ వేతనం ఇవ్వకపోవడం బాధాకరం. ఆరు నెలలుగా గౌరవ వేతనం ఇవ్వకపోతే ఎలా జీవిస్తారు. ఇది సరైన విధానం కాదు. ప్రభుత్వం వెంటనే స్పందించాలి. ఆరు నెలల బకాయిలను తక్షణమే వారి బ్యాంకు ఖాతాలకు జమ చేయాలి.

– పర్వతనేని శ్రావణి సుధీర్, సర్పంచ్, రామారావుగూడెం

ప్రభుత్వం స్పందించాలి



లక్షలాది రూపాయల ప్రభుత్వ ఆస్తులను కాపాడే నైట్ వాచ్‌మెన్లకు కూటమి ప్రభుత్వం ఇచ్చే గౌరవం ఇదేనా. కుటుంబ సభ్యులను వదిలి ప్రభుత్వ ఆస్తులను కాపాడుతున్నారు. వారికి ఇచ్చే గౌరవ వేతనమే తక్కువ. అది కూడా ఆరు నెలలు నిలుపుదల చేస్తే ఎలా. ప్రభుత్వం స్పందించాలి. నైట్ వాచ్‌మెన్లకు న్యాయం చేయాలి.

– అంగడాల వేంకటేశ్వరరావు, ఎంపీటీసీ, మేధినరావుపాలెం

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



ర్యాలీ చేస్తున్న వైద్యాధికారిణి జాహ్నవి, మలేరియా అధికారి గోవిందరావు

భీమడోలు: వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలి అనారోగ్య సమస్యలు తలెత్తకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గుండుగొలను వైద్యాధికారిణి డాక్టర్ జాహ్నవి, జిల్లా అసిస్టెంట్ మలేరియా అధికారి జె.గోవిందరావు అన్నారు. జాతీయ డెంగీ వ్యతిరేక మాసోత్సవాన్ని పురస్కరించుకుని పీహెచ్‌సీ పరిధిలోని భీమడోలులో వైద్య ఆరోగ్య సిబ్బంది మంగళవారం అవగాహన ర్యాలీని నిర్వహించారు. గ్రామ పురవీధుల్లో ర్యాలీ చేసి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధిక వర్షాల వలన దోమల ప్రబలి ప్రాణాంతక వ్యాధులైన డెంగీ, మలేరియా, చికున్‌గున్యా వంటి వ్యాధులు ప్రబలుతాయన్నారు. నీటి కలుషితం వలన టైఫాయిడ్, అతిసారం, కామెర్లు వంటి రోగాలు వ్యాప్తి చెందుతాయన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రామకృష్ణ, హెల్త్ అసిస్టెంట్ మేకా శ్రీనివాసరావు, మురళి, చందూకుమార్, ఎంఎల్‌హెచ్‌పీ నికిత, కార్యకర్తలు వెంకటలక్ష్మి, వెంకటరత్నం, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

రైల్వే గేట్ మూసివేత



మరమ్మతుల కారణంగా మూసివేసిన రైల్వే గేటు

భీమడోలు: భీమడోలు రైల్వే ట్రాక్ మరమ్మతు పనులు మంగళవారం నుంచి ప్రారంభమయ్యాయి. వాస్తవానికి సోమవారం నుంచి పనులు ప్రారంభించాల్సి ఉండగా సాంకేతిక కారణాల రీత్యా పనులు జరగలేదు. జాతీయ రహదారికి అనుసంధానంగా ఉన్న భీమడోలు రైల్వే ట్రాక్ అత్యవసర పనులు ఈ నెల 24వ తేదీ గురువారం సాయంత్రం వరకు నిర్వహిస్తామని రైల్వే అధికారులు చెబుతున్నారు. అయితే తొలి రోజు తెరచి ఉండడంతో యథావిధిగా రైల్వే గేటు వైపు రాకపోకలు సాగించేందుకు వచ్చిన వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. ద్వారకాతిరుమల, జంగారెడ్డిగూడెం, సత్తుపల్లి వెళ్లే ఆర్టీసీ బస్సులు వడ్లపట్ల, పాతూరు అండర్ బ్రిడ్జిల మీదుగా రాకపోకలు సాగించాయి. వాహనదారులు తికమక పడి ఇబ్బందులు పడ్డారు. ఇరుకైన రోడ్లలో రాకపోకలు సాగించడం వలన ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురవుతున్నాయని వాహనదారులు వాపోతున్నారు. భీమడోలు శివారు పెదలింగంపాడు ఏరియాలో ఉన్న పంట పొలాలకు వెళ్లే రైతులు నానా అవస్థలు పడుతున్నారు.

బాల్య వివాహాలతో అనర్థాలు



బాల్య వివాహాలపై వ్యతిరేక ప్రచారోద్యమం నిర్వహిస్తున్న అధికారులు

ఉంగుటూరు: బాల్య వివాహాలపై వ్యతిరేక ప్రచార కార్యక్రమం బాదంపూడి, నీలాద్రిపురం హైస్కూల్స్‌లో మంగళవారం నిర్వహించారు. చైల్డ్ రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్-క్రాఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాలకు ప్రధానోపాధ్యయులు అధ్యక్షత వహించారు. ప్రతి విద్యార్థి బాగా చదువుకొని ఎవరి కాళ్ల మీద వారు నిలబడే సామర్థ్యం సంపాదించుకోవాలని విద్యార్థులకు వక్తలు హితవు పలికారు. ఆడపిల్లకు 18 సంవత్సరాలు నిండకుండా పెళ్లి చేయడం నేరమన్నారు. ఆరోగ్యం, ఆర్థిక సామాజిక, శారీరక, మానసిక సమస్యలు ఆడ పిల్లలకు ఉత్పన్నమవుతాయని వక్తలు తెలిపారు. ప్రధానోపాధ్యాయులు వైవీ పద్మావతి (బాదంపూడి), విజయదుర్గ (నీలాద్రిపురం), మహిళా సంరక్షణ కార్యదర్శులు ఎం.బేబీసరోజినీ, జిల్లా కో-ఆర్డినేటర్ ఎస్.రవిబాబు, రేఖ, కామేశ్వరి, ప్రియాంక, మరియమ్మ, రాము, రంగనాయకి, శ్రావణి, మహేష్, చిన్ని, మాట్లాడారు. కళాకారులు ప్రదర్శన ఇచ్చారు.

మంచినీటిలో క్లోరినేషన్ చేయించాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో రాజ్‌మనోజు

ఉంగుటూరు: మంచినీటి ట్యాంకుల్లో క్లోరినేషన్ విధిగా చేయించాలని పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఉంగుటూరు ఎంపీడీవో రాజ్‌మనోజు సూచించారు. మంగళవారం ఉంగుటూరు ఎంపీడీవో ఆఫీసులో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎంపీడీవో మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాలకు నీరు రంగు, రుచి మారే అవకాశం ఉన్నందున క్లోరినేషన్ తప్పనిసరి అని, అలాగే ప్రజలు కాచుకుని నీళ్లు తాగేలా చైతన్య పరచాలని కోరారు. పల్లె పల్లెకు ధర్మరాజు కార్యక్రమం స్థానిక నాయకులతో కలిసి విజయవంతానికి కృషి చేయాలని ఎంపీడీవో సూచించారు. పీ-4కు సంబంధించి బంగారు కుటుంబాలను గుర్తించి వారిని దత్తత తీసుకోవడానికి మార్గదర్శకాలను ఎంపిక చేయడంపై సమీక్షించారు. కొత్తగా జాయిన్ అయిన కార్యదర్శులు, డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాసరావు పాల్గొన్నారు.

1400 మట్టి నమూనాల సేకరణ

దెందులూరు: మండలంలో 17పంచాయతీల్లో వ్యవసాయ శాఖ లక్ష్యాలకు అనుగుణంగా 1400 మట్టి నమూనాలు సేకరించామని దెందులూరు మండల వ్యవసాయ అధికారి శ్రీనివాసరాజు అన్నారు. మంగళవారం కొవ్వలిలో ఆయన మాట్లాడుతూ రైతుల పొలాల నుంచి తీసిన మట్టి నమూనాలను పరిశోధన కేంద్రాలకు పంపించామన్నారు. కేంద్రాల నుంచి రిపోర్టు వచ్చిన వెంటనే రైతులకు భూసారం అనుగుణంగా వాడవలసిన ఎరువులు పురుగు మందులు మోతాదు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వ్యక్తిగతంగా సమాచారం ఇచ్చామన్నారు. అన్ని గ్రామాల్లో వ్యవసాయ శాఖ అసిస్టెంట్లు రైతులతో సమన్వయంగా వ్యవహరించి వారి పొలాల నుంచి మట్టి నమూనాలు సేకరించారన్నారు.

డ్రాపవుట్ రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు కృషి



గుండుగొలను ఉన్నత పాఠశాలలో బాలికలకు చదువు, బాల్యవివాహాలపై అవగాహన కల్పిస్తున్న జిల్లా పీడీ పి.శారద, పీవో సునీల్, ఎంఈవోలు

భీమడోలు: జిల్లాను డ్రాపవుట్ రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ ఉద్యోగులు కృషి చేయాలని ఐసీడీఎస్ జిల్లా పీడీ పి.శారద అన్నారు. మండలంలోని గుండుగొలను, ఆగడాల లంక ఉన్నత పాఠశాలలను మంగళవారం ఐసీడీఎస్ పీవో ఎంఎస్ రాజశేఖర్‌తో కలిసి ఆమె ఆకస్మిక సందర్శన చేశారు. బడి ఈడు బాలికలు పాఠశాలలో చేరారో లేదో చూడాలన్నారు. వారిలో ఏడు నుంచి పదో తరగతి చదువుతూ మధ్యలో మానేసిన డ్రాపవుట్స్ ఉన్నారా తదితర విషయాలను హెచ్‌ఎంలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో ప్రధానంగా బడి ఈడు బాలికలు పాఠశాలల్లో ఉండాలన్నారు. బాలికలు డ్రాపవుట్‌గా మారడం వలన తల్లిదండ్రులు బాల్య వివాహాలు చేస్తున్నారన్నారు. ఈ విధానాన్ని మానుకోవాలన్నారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరిగితే ఉన్నతాధికారులకు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో పీవో ఎంఎస్ రాజశేఖర్, ఎంఈవో-1, 2 ఈదుపల్లి శ్రీనివాసరావు, అయినపర్తి భాస్కర్‌కుమార్, హెచ్‌ఎంలు జి.సునీత, బి.మోహనరావు, ఈవో మల్లిక, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు నూర్జహాన్, కవిత తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల తీరు అమానుషం

పెదపాడు: హనుమాన్ జంక్షన్‌లో వైఎస్సార్ సీపీ నాయకులు చేపట్టిన నిరసన కార్యక్రమాన్ని నిర్వహించరాదని చెప్పడం అమానుషమని పెదపాడు మండల కన్వీనర్ అప్పన ప్రసాద్ తెలిపారు. పెదపాడు మండలంలోని అప్పనవీడులో సోమవారం వైఎస్సార్ సీపీ ఎంపీ మిథున్‌రెడ్డి అరెస్టుకు నిరసనగా ర్యాలీ నిర్వహించారు. హనుమాన్ జంక్షన్ నాలుగు రోడ్ల వెంబడి ర్యాలీ నిర్వహించొద్దని పోలీసులు చెప్పడం సరికాదన్నారు. గతంలో ఇదే విధంగా శాంతియుతంగా ర్యాలీ నిర్వహిస్తే ఎవరూ అభ్యంతరం తెలపలేదని ప్రస్తుతం పోలీసులు మాత్రం హనుమాన్ జంక్షన్ పరిధిలోకి రావొద్దని చెప్పారన్నారు. గుడివాడ రోడ్డులో కూడా హనుమాన్ జంక్షన్ పోలీస్ పరిధిలోనే ఉందని, ఏ ఘటన జరిగినా మేమే విధులు చేపడుతున్నామని, దీనిని దృష్టిలో ఉంచుకొని ఏలూరు రోడ్డు మినహా ఏ రహదారిపైనా ర్యాలీ నిర్వహించొద్దని హెచ్చరికలు జారీ చేశారన్నారు. ఈ విధంగా వ్యవహరించడం ఎన్నడూ చూడలేదని ఇది న్యాయబద్ధంగా అనిపించడం లేదని చెప్పారు.

విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న డీఈఓ వెంకటలక్ష్మమ్మ

పెదవేగి: పాఠశాలల్లో విద్యార్థులు డ్రాపవుట్లు లేకుండా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటలక్ష్మమ్మ అన్నారు. మంగళవారం కొప్పాక, పెదవేగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులో రెమిడియల్ తరగతుల గురించి, జూన్ నుంచి ప్రత్యేక తరగతుల నిర్వహణపై ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులను అభినందించారు. విద్యార్థుల ప్రగతిని పరిశీలించారు. విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరుకావాలన్నారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకంలోని మెనూపై విద్యార్థులతో మాట్లాడి భోజనం చేశారు. కార్యక్రమంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శాకంబరిగా అమ్మవారు

ఉంగుటూరు: కైకరం వర కనకదుర్గ అమ్మవారు శాకంబరి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. కైకరం గ్రామం తూర్పు వీధి కాలువ గట్టుపై వెలసిన శ్రీ వరకనకదుర్గ లింగేశ్వరస్వామి దేవాలయంలో ఆషాడమాసం పురస్కరించుకొని ని భక్తులు అమ్మవారిని పలు రకాల కూరగాయలతో అలంకరించారు. అమ్మవారి అలంకరణ సేవలో పలువురు భక్తులు పాల్గొన్నారు.

కూటమి పాలనలో వైద్య రంగం కుదేలు

- కుయ్.. కుయ్ సైరన్ మోతలు లేవు
- ఏలూరు జీజీహెచ్‌లో క్రిటికల్ కేర్ లేదు
- పట్టించుకోని పాలకులు, జిల్లా అధికారులు



ఏలూరు సర్వజన ఆసుపత్రి (ఫైల్)



గతంలో 108 అంబులెన్స్ సేవలు ఇలా (ఫైల్)

ఏలూరు టౌన్: టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది కాలంలో వైద్య రంగం కుదేలైంది. ఏలూరు సర్వజన ఆసుపత్రిలో వైద్య సేవలు అందే పరిస్థితి లేకపోవటంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఏదైనా ఆరోగ్యం విషమిస్తే, కార్పొరేట్ హాస్పిటల్ లేదా విజయవాడ, గుంటూరు ప్రాంతాలకు తరలించటమే పరిపాటిగా మారింది. పేద, మధ్య తరగతి వర్గాల ప్రజల ప్రాణాలకు భరోసా లేకుండా పోయింది. మరోవైపు తీవ్ర అనారోగ్యమో లేక రోడ్డు ప్రమాదమో జరిగి ఆపద స్థితిలో అత్యవసర సేవల 108కు ఫోన్ చేస్తే, అంబులెన్స్‌ను అందుబాటులో లేవనే సమాధానం వస్తోంది. ఏలూరు జిల్లా కేంద్రమైన నగరంలోనే వైద్య సేవలు ఇంత దారుణంగా, నిర్లక్ష్యంగా ఉంటే ఇక గ్రామాల్లో పరిస్థితి ఎంత అధ్వానంగా ఉందో అర్థమవుతుంది.

- ఏలూరు వన్‌టౌన్ ప్రాంతానికి చెందిన ఒక వ్యక్తిని తీవ్ర అనారోగ్యంతో ఏలూరు సర్వజన ఆసుపత్రికి తీసుకొచ్చారు. గ్యాస్ నొప్పో లేదా గుండె నొప్పో తెలియని పరిస్థితిలో వస్తే కనీసం ప్రాథమిక వైద్య చికిత్స చేయకుండానే విజయవాడ రిఫర్ చేశారు. ఏలూరులోని కార్పొరేట్ హాస్పిటల్‌కు వెళదామంటే జేబులో భారీగా డబ్బు ఉండాల్సిందే. పేదలు కావటంతో చేసేదేమీ లేక ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని విజయవాడ వెళ్లాల్సిన దుస్థితి వచ్చిందని బాధితులు వాపోయారు.
- ఏలూరు నగరానికి చెందిన ఒక వ్యక్తికి మోటారు సైకిల్ ప్రమాదంలో తీవ్ర గాయాలయ్యాయి. రోడ్డుపై పడిపోయి ఉండడంతో స్థానికంగా ప్రజలు గుమిగూడారు. అర్జెంటుగా హాస్పిటల్‌కు తరలించాలనే ఉద్దేశంతో అత్యవసర సేవల 108 అంబులెన్స్‌కు కాల్ చేశారు. ఏలూరులో 108 అంబులెన్స్‌లు అందుబాటులో లేవని, సమయం పడుతుందని సమాధానం చెప్పారు. కూటమి ప్రభుత్వంలో ఇంతకంటే ఏమి ఆశించలేమంటూ అక్కడి యువత అసహనం వ్యక్తం చేయటం గమనార్హం.


జీజీహెచ్‌లో వైద్యం నిల్

ఏలూరు సర్వజన ఆసుపత్రిలో వైద్య సేవలు అధ్వానంగా మారాయి. నిత్యం ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాల నుంచి సుమారుగా 900 నుంచి 1200 మంది రోగులు హాస్పిటల్‌కు వస్తుంటారు. ఓపీ సంగతి అటుంచితే, అత్యవసర సేవలు అందే పరిస్థితి పూర్తిగా కనుమరుగైందనే చెప్పాలి. ఏలూరు జీజీహెచ్‌లో నిపుణులైన వైద్యులను నియమించాల్సి ఉండగా ఏడాది గడచినా కూటమి ప్రభుత్వం అలాంటి చర్యలేమీ చేపట్టలేదు. ముఖ్యంగా హార్ట్‌ఎటాక్ వస్తే ప్రాథమిక వైద్యం చేసే పరిస్థితి కూడా లేదని బాధిత రోగుల బంధువులు వాపోతున్నారు. రోడ్డు ప్రమాదాల్లో ముఖ్యంగా తలకు దెబ్బ తగిలి వస్తే న్యూరో సర్జన్, క్రిటికల్ కేర్ వైద్య నిపుణులు చికిత్స అందించాల్సి ఉంటుంది. కానీ ఏలూరు జీజీహెచ్‌లో అత్యవసర వైద్య సేవలు పూర్తిగా నిర్వీర్యమయ్యాయి.

కనిపించని 108 వాహనాలు

దివంగత మహానేత డాక్టర్ వైఎస్సార్ కుయ్.. కుయ్ మంటూ 108 అంబులెన్స్‌లను రోడ్లపై పరుగులు పెట్టించారు. 2019 – 24 మధ్యలో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సైతం కొత్త అంబులెన్స్ వాహనాలు కొనుగోలు చేసి కరోనా వంటి ఆపత్కాలంలో భరోసా కల్పించారు. కానీ నేడు కూటమి ప్రభుత్వంలో అత్యవసర సేవల 108 అంబులెన్సుల సైరన్ వినిపించటంలేదు. రోడ్డు ప్రమాదం లేదా తీవ్ర అనారోగ్యంతో కాల్ చేస్తే అంబులెన్స్ వాహనాలు అందుబాటులో లేవని చెబుతున్నారని, ఏలూరులోనే లేకుంటే ఇక గ్రామాల్లో పరిస్థితి ఏమిటనేది ప్రశ్నార్థకంగా మారింది. ఏలూరు జీజీహెచ్ నుంచి విజయవాడ, గుంటూరు ప్రాంతాలకు అంబులెన్స్‌లు పంపుతూ నగరంలో మాత్రం లేకుండా చేస్తున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.


ఆరోగ్య భరోసా లేదు



కూటమి ప్రభుత్వంలో పేద, మధ్యతరగతి ప్రజలకు ప్రభుత్వ వైద్యం అందే పరిస్థితి లేదు. గత వైఎస్సార్ సీపీ హయాంలో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్యరంగానికి అత్యధిక ప్రాధాన్యత ఇచ్చారు. కానీ కూటమి ప్రభుత్వం పేదలకు ఆరోగ్య భరోసా కల్పించలేని దుస్థితిలో ఉంది. ఏలూరు జీజీహెచ్‌లో నిపుణులైన వైద్యులను నియమించలేకపోయింది. గుండె, న్యూరో సర్జన్, క్రిటికల్ కేర్ వంటి కీలక పోస్టులను సైతం భర్తీ చేయకపోయింది. ప్రజల ప్రాణాలంటే ఈ ప్రభుత్వానికి లెక్కలేదు.

– నూకపెయ్యి సుధీర్‌బాబు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్

ఫోన్ చేసినా రావటం లేదు



ఏలూరు నగరంలో అత్యవసర పరిస్థితిలో 108 అంబులెన్స్ కోసం ఫోన్ చేస్తే రావటంలేదు. గతంలో మాజీ సీఎం జగనన్న హయాంలో 10 నిమిషాల్లోపే అంబులెన్స్‌లు వచ్చేవి. జిల్లా కేంద్రంలోనే అంబులెన్స్‌లు అందుబాటులో లేవని చెప్పటం విడ్డూరంగా ఉంది. రోడ్డు ప్రమాదం జరిగి ప్రాణాపాయంలో ఉంటే టైమ్ పడుతుందని సమాధానం చెబుతున్నారు. అధికారులు, నాయకులు దీనిపై చర్యలు తీసుకోవాలి.

– బండ్లమూడి సునీల్‌కుమార్, యువజన నాయకులు, వైఎస్సార్ సీపీ

పోలీసుల సంక్షేమానికి ప్రాధాన్యత



ఉద్యోగ నియామక పత్రం అందిస్తున్న ఎస్పీ శివకిషోర్

ఏలూరు టౌన్: పోలీసుల సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తామని, సిబ్బంది కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిషోర్ అన్నారు. ఏలూరు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఎక్సైజ్ శాఖలో పనిచేస్తూ అనారోగ్యంతో మరణించిన కె.డేవిడ్‌రాజు కుమారుడు యశ్వంత్ పృథ్వీకి కారుణ్య నియామకంలో భాగంగా ఉద్యోగ నియామక పత్రాన్ని ఆయన అందజేశారు. యశ్వంత్‌కు ఏలూరు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగం కల్పించినట్లు ఎస్పీ తెలిపారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ నక్కా సూర్యచంద్రరావు, పోలీస్ ప్రధాన కార్యాలయ అధికారి వైఎస్‌వీ ప్రసాద్, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

అనారోగ్యంతో మరణించిన ఏఎస్సై డీవీవీ ఎన్ఎస్ మూర్తి కుటుంబానికి ఎస్పీ శివ కిషోర్ ఆర్థిక సాయం అందించారు. ఏలూరు డీసీఆర్‌బీలో పనిచేసే సమయంలో అనారోగ్యంతో మూర్తి మృతిచెందారు. ఆయన భార్య వల్లినాగ విజయలక్ష్మికి కార్పస్ ఫండ్‌గా రూ.1 లక్ష, పోలీస్ అసోసియేషన్ నుంచి రూ.1 లక్ష చెక్కు రూపంలో అందజేశారు. పోలీస్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు నాగేశ్వరరావు, పోలీస్ అధికారులు ఉన్నారు.